**ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక, న్యూజెర్సీ తెలుగు కళాసమితి, రాజ్యలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో 1,500 రూ. గెలుచుకొన్న (తృతీయబహుమతి) కథ**

అర్థరాత్రి కావచ్చింది.

చెరువుకట్టమీది గుడి ముందర లైటు వెలుగు క్రీనీడలో శేషారెడ్డి జీపు కోసం కాపువేసి ఉన్న వ్యక్తి అసహనంగా కదిలాడు.


ఆ వ్యక్తి సైగ కోసం రోడ్డువెంట సుమారు ఫర్లాంగు దూరంలో కొండయ్య బాంబులతో సిద్ధంగా ఉన్నాడు. అతనికి కొంచెం యెడంగా ఐదారుగురు బలిష్టులైన వ్యక్తులు కత్తులు, ఈటెలతో ఉన్నారు. వారికి యింకొంచెం దూరంలో పిస్టల్‌తో ప్రతాప్‌రెడ్డి. అందరూ ఎండిపోయిన చెరువులో కంపచెట్లు, పొదల్లో నక్కి, గుడిప్రక్క నుండి వచ్చే వాహనాలను గమనిస్తూ, తమ మనిషి సైగ కోసం నిరీక్షిస్తున్నారు.

ఈసారి ఎలాగైనా శేషారెడ్డిని మట్టుబెట్టకపోతే, తను శేషారెడ్డి చేతిలో చావడం ఖాయం అని పకడ్బందీగా పథకం వేశాడు ప్రతాప్‌రెడ్డి.

'ఏటిదరిమానికి ఎప్పుడూ చలనమే'. ఈ కొంపిలో ఇరుక్కున్నప్పటి నుంచి పగ, ప్రతీకారం తప్ప వేరే ఆలోచనే లేదు. ఎక్కడికి పోవాలన్నా, పదిమంది మనుషులు వెంట ఉండాల్సిందే. ప్రత్యర్థి ఏ వైపు నుంచి ఎక్కడ దాడి చేస్తాడో తెలియదు. చచ్చేందుకుగాని, ఎదుటివాడిని చంపేందుకుగాని ఎప్పుడూ సంసిద్ధుడిగా ఉండాల్సిందే.

తన అన్న మోహనరెడ్డి హత్య జరిగినపుడు






ప్రతాపరెడ్డి కడపలో డిగ్రీ చదువుతూ ఉన్నాడు. హత్యకు కారణాలు ఎవరికి తోచింది వాళ్ళు చెప్పకున్నారు.

ప్రభుత్వాసుపత్రి నుంచి శవాన్ని తీసుకుని ఊరికి వచ్చేడప్పటికి నివురుగప్పిన నిప్పులా ఉన్న ఊరు ఒక్క సారిగా భగ్గుమంది. మోహనరెడ్డి అనుచర వర్గమంతా శేషారెడ్డికి చెందిన ఆస్తులన్నింటినీ ధ్వంసం చేశారు. కనబడిన శేషారెడ్డి మనుషులం దర్నీ చితకబాదారు.

మరుసటి రోజు పోలీసోళ్ళు వచ్చి మోహ నరెడ్డి మనుషులందర్నీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపోయి లోపల వేశారు. శేషారెడ్డి ఎమ్మెల్యే ఇంట్లో తలదాచుకుని, ఊళ్ళోకి పోలీసోళ్ళని పంపాడని చెప్పకున్నారు.

మోహనరెడ్డి హత్యలో మొదటి ముద్దాయి శేషా రెడ్డిని వదిలి, మోహనరెడ్డి మనుషులను పోలీసులు దొమ్మికింద అరెస్టు చేసేటప్పటికి సానుభూతిప రులు ప్రతాపరెడ్డి దగ్గరకు వచ్చి రెచ్చగొట్టసాగారు. అందులో ముఖ్యమైనవాడు చెంచిరెడ్డి. చెంచిరెడ్డికి

శేషారెడ్డికి చాలా రోజుల నుంచి భూముల దగ్గర తకరారు ఉంది.

"ఊరు ఊరంతా గగ్గోలుగా ఉంటే నిమ్మకు నీరెత్తినట్టుండావు? మన మనుషులను శేషారెడ్డి అరెస్టు చేయిస్తే వాళ్ళను విడిపించుకురాకుండా ఆలోచిస్తున్నావు?" అన్నాడు ప్రతాపరెడ్డితో.

"వాళ్ళను నేనేమీ కాల్చి రమ్మని పంపలేదే?" ప్రతాపరెడ్డి మాట నోట్లో ఉండగానే 'కయ్'మన్నాడు చెంచిరెడ్డి. "ఎవరి కోసం చేశారు? మీ అన్నను చంపినా ఏం చేసుకోలేదంటే ఆ శేషారెడ్డి రెచ్చిపోయి నిన్ను మాత్రం బతకనిస్తాడా?

మనం కూడా తలకాయకు, తలకాయ తీస్తామని హెచ్చరించకుంటే అసలు వాడిఆరాచకాలకు అంతుంటుందా? ఈ పిరికి మాటలు నీకెట్లా అచ్చినాయిరా! చదువుకుంటాండావుగానీ, నీకు లోకజ్ఞానం లేదే? పద ఆ మాజీ ఎమ్మెల్యే దగ్గరికిపోయి కావాల్సిందేదో చూద్దాం!" అన్నాడు.

అంతేకాకుండా ప్రతాప్‌రెడ్డి వదినె "నా భర్తను చంపిన వాడి శవాన్ని చూడందే నేను ముండమొయ్యను" అని భీష్మ ప్రతిజ్ఞ చేసింది. ఆమెను చూసినప్పుడల్లా ప్రతాప్‌రెడ్డిలో రక్తం సలసలా కాగ సాగింది.

ఆ పరిణామాల్లో ప్రతాప్‌రెడ్డి రంగంలోకి దిగక తప్పలేదు. ఓ రోజు కేసు సంబంధంగా కడపకు వచ్చి తిరిగి ఇంటికి పోయే దారిలో నలుగురు మనుషులు వెంబడించ సాగారు. తన వెంట ఉన్న కొండయ్య అన్న, ఇంకా ఇద్దరు మనుషులు తిరగబడి వాళ్ళను ఎదుర్కోబోతే కొండయ్య అన్నను చంపి ప్రతాప్‌రెడ్డి కోసం వెంటపడ్డారు. ప్రతాప్‌రెడ్డి తృటిలో తప్పించుకున్నాడు. అప్పటి నుంచి ప్రతాప్‌రెడ్డి ఎక్కడికి బయలుదేరినా వెంట మందీ మార్బలం ఆయుధాలతో ఉండాల్సిందే. కడుపు వస్తే కనక తప్పదు మరి.

శేషారెడ్డిని చంపాలనుకుని రెండుమార్లు ప్రయత్నించాడు ప్రతాప్‌రెడ్డి. అయితే అతని అనుచరులు పదిమంది దాకా చచ్చారుగానీ శేషారెడ్డి దొరక్కుండా తప్పించుకున్నాడు. ఈ మధ్యలో ప్రతాప్‌రెడ్డి అనుచరులను ఐదుగురిని శేషారెడ్డి మనుషులు పొట్టన పెట్టుకున్నారు. ఊరు ఊరంతా రెండు వర్గాలుగా చీలిపోయింది. చిన్న తగవు జరిగినా ఇరువర్గాలు బాంబులు, కత్తులతో దాడి చేసుకోవడం జరుగుతూ ఉంది.

** ** ** **

రెండు గంటలు అయింది. శేషారెడ్డి జీవు జాడలేదు. ప్రతాప్‌రెడ్డి కూర్చున్న చోటు నుంచి లేచి కొండయ్య దగ్గరికి వచ్చాడు. "ఏరా కొండయ్యా! ఆ రత్తయ్యగాడు మనకు పూర్తిగా లొంగినట్టేనా?" అన్నాడు ప్రతాప్‌రెడ్డి. రత్తయ్య శేషారెడ్డి ముఖ్య అనుచరుడు. అతడికి డబ్బు ఆశ జూపి, కొండయ్యకు రత్తయ్యతో ఉన్న పాత బంధుత్వం ద్వారా బెదిరించి లొంగదీసుకున్నారు. అతడే ఇప్పుడు శేషారెడ్డి గురించి వార్త పంపింది.

"ఆ! లేదయ్యా, వాడిమీద అనుమానం వద్దు. భార్యాబిడ్డల మీద ప్రమాణం చేసి డబ్బు అందుకున్నాడు. పొరబాటు జరిగితే ప్రాణం తీస్తానని చెప్పొచ్చానయ్యా!" అన్నాడు కొండయ్య.

"సరే! జాగ్రత్త!" అని ప్రతాప్‌రెడ్డి తిరిగి తన చోటుకు బయలుదేరి కొంచెం... కొంచెం... జంకాడు" తను రత్తయ్యను లోబరుచుకున్నట్టుగా– కొండయ్యను శేషారెడ్డి లోబరుచుకోలేదు గదా!" క్షణం సేపు ప్రతాప్‌రెడ్డి వణికాడు. తిరిగి సర్దుకున్నాడు. నిండా మునిగిన తర్వాత చలికేడ్సి ఏమి ప్రయోజనం?

ప్రతాప్‌రెడ్డి ఆలోచన నుండి బయటపడక ముందే, కొండయ్య గట్టిగా కేకవేసి చేతిలో బాంబులతో రోడ్డెక్కాడు. గుడి దగ్గర మనిషి తువ్వాలు విసురుతూనే ఉన్నాడు. ఈ లోపుగా దాక్కొని ఉన్న మిగతా మనుషులు ఆయుధాలతో రోడ్డెక్కి జీపుకెదురుగా నడవ సాగారు. ప్రతాప్‌రెడ్డి పరుగు పరుగున పిస్టల్‌తో రోడ్డెక్కబోతున్నాడు.



అప్పుడు పేలినాయి ఐదారు బాంబులు. బాంబుల శబ్దం నిల్చిపోకముందే శేషారెడ్డి జీపు పల్టీలు కొట్టుకుంటూ వచ్చి నలభై యాభై అడుగుల కిందకు చెరువులో పడిపోయింది.

"శభాస్! ఎంత ధైర్యంగా నిలబడి బాంబులు విసిరినావన్నా! చావు తెగింపు చేసినావే" కొండయ్య వెంట ఉన్న మనుషులు కొండయ్యను మెచ్చుకుంటున్నారు. కొండయ్య గంభీరంగా నిలబడిపోయి తేరుకుని "ముందు చెర్లోకి దిగి అందులో శేషారెడ్డి ఉన్నాడో లేడో చూద్దాం పదా!" అన్ని టార్చిలైట్ వేసుకుంటూ కిందికి దిగి శేషారెడ్డి కోసం వెదక సాగారు.

శేషారెడ్డి అనుచరులు ఆరేడుమంది చెల్లాచెదురుగా పడిపోయి ఉన్నారు. తలలు పగిలి, కాళ్ళు, చేతులు విరిగిపోయి రక్తం ఓడ్చుకుంటూ మూలుగుతున్నారు. కానీ ఎంత వెతికినా శేషారెడ్డి ఆ కంపచెట్ల మధ్య కన్పించలా.

కొండయ్య, తదితరులంతా ఇంకా వెతుకుతూనే ఉన్నారు. ప్రతాప్‌రెడ్డి దూరంగా వచ్చి నిలబడి ఆలోచనలో పడ్డాడు. "శేషారెడ్డి తప్పించుకున్నట్లేనా? అసలు జీవులో లేడా?" ప్రతాప్‌రెడ్డికి ముచ్చెమటలు పోస్తున్నాయి. అయినా చుట్టుప్రక్కల ఆశకొద్దీ వెతుకుతున్నాడు.

రోడ్డుమీద ఓ లారీ మలుపు తిరుగుతుండగా చెరువులో కాంతి పడింది. ఆ వెలుగులో ఓ తెల్లని గుడ్డ జరుగుతున్నట్టుగా గమనించి ఒక్కసారిగా పరిగెత్తి చూశాడు. శేషారెడ్డి కాళ్ళు విరిగి చేతులతో పాక్కుంటూ పోతున్నాడు.

ప్రతాప్‌రెడ్డి పరుగెత్తి రావడం గమనించి "ఆ! ఓ! ప్రతాప్! నన్ను చంపమాకు" అంటూ ఏడ్వడం ప్రారంభించాడు శేషారెడ్డి. "మా అన్నను చంపినప్పుడేమైందిరా" అంటూ ప్రతాప్‌రెడ్డి, శేషారెడ్డి తలమీద తన్నాడు బలంగా.

శేషారెడ్డి భయంతో బిగదీసుకుపోయి, గడగడా వణికిపోసాగాడు. "నేను... నేను చంపలా. ఆ ఎమ్మెల్యే చేయించాడు, నేను వద్దన్నా వినలా" చావుభయంతో అంటున్నాడని ప్రతాప్‌రెడ్డికి అర్థమైంది. "సరే సంపు. మీ అన్న ఒక్కసారిగా చచ్చాడు. నేను రోజూ చస్తున్నా. ఈ బతుక్కంటే చావడమే మేలు." శేషారెడ్డిని వదిలేసి పోదామా' అని ప్రతాప్‌రెడ్డి క్షణంసేపు ఆలోచించాడు.

ఇంతలో కొండయ్య, మిగతావాళ్ళు దగ్గరికి వచ్చారు– "అయ్యా! వీడ్నింకా చంపలేదే! నర్కయ్య కత్తా" అని కొండయ్య కత్తి లాక్కొని శేషారెడ్డి మెడమీద వేశాడు. శేషారెడ్డి తల ఎగిరి దూరంగా పడింది. ప్రతాప్‌రెడ్డి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. అంతా కలగా ఉంది అతడికి.

"అయ్యా!" కొండయ్య పిలుపుకు తలెత్తాడు ప్రతాప్‌రెడ్డి. "ఒక పని అయిపోయిందయ్యా!" కొండయ్యకేదో దెయ్యం పట్టినట్టుగా మాట్లాడుతున్నాడు.

"ఇక పదరా! పరుగెత్తి పోదాం తెల్లవారొస్తోంది" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

అదిగో అప్పుడు నవ్వాడు కొండయ్య గుండెలు పగిలిపోయేటట్టు, చెరువంతా ప్రతిధ్వనించేటట్టుగా "మీరు కూడా చచ్చిపోతే మేము పరుగెత్తి పోతామయ్యా!" అన్నాడు. ప్రతాప్‌రెడ్డి ఒళ్ళు గగుర్పొడిచింది.

"ఏందిరా పేలుతున్నావు. ఇన్ని రోజులు నావెంట ఉండి, నా ఉప్పు–పులుసు తిని" ప్రతాప్‌రెడ్డిని అడ్డుకున్నాడు కొండయ్య.

"అవునయ్యా! నీ ఉప్పు–పులుసు నా కోసం తినలేదయ్యా! నిన్ను కాపాడేందుకు తిన్నామయ్యా. అందుకే మా నాయన, అన్నా ఇద్దరూ నీ కోసమే చచ్చారయ్యా! శేషారెడ్డి కొడుకు నిన్ను వదిలిపెట్టడయ్యా! నీ కోసం వేటాడతాడు. నిన్ను చంపుతాడు. ఆ లోపల మమ్ములను కూడా చంపుతాయ్యా! అందుకేనయ్యా నువ్విప్పుడు చచ్చిపోతే మేము బతికిపోతామయ్యా" కొండయ్య మాటలు చూస్తే తనను వదిలేస్తాడని అన్పించలా ప్రతాప్‌రెడ్డికి. అందుకే వెంటనే పిస్టల్ కోసం తడుముకున్నాడు.

అయితే అప్పటికే ఆలస్యమై పోయింది.